క్లుప్తంగా

రహదారులను ఆక్రమిస్తే చర్యలు



పొన్నూరు: పట్టణంలోని రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని ప్రధాన రహదారుల్లో కమిషనర్, సిబ్బందితో కలిసి ఆక్రమణలను గుర్తించారు. రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించరాదని, కాలువకు వెనుక మాత్రమే వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు. హద్దు దాటి ప్రయాణికులకు, ఆర్టీసీ బస్సులకు, వాహనాలకు అడ్డుగా దుకాణాలు ఏర్పాటు చేస్తే జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా వ్యాపారం నిర్వహించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు ఛానల్‌కు మరమ్మతులు చేపట్టాలి



పెదకాకాని: నిత్యం లక్షల మందికి తాగునీరు, పొలాలకు సాగునీరు అందించే గుంటూరు ఛానల్ కాలువకు సత్వరం మరమ్మతులు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు ఛానల్‌ను శనివారం రైతులతో కలిసి సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా నన్నపనేని మాట్లాడుతూ గుర్రపు డెక్కతో పూడుకు పోయిందని తక్షణమే గుర్రపు డెక్కను తొలగించాలని, కాలవ కట్టలు మరమ్మతులు చేయాలన్నారు. అలానే లాకులు తుప్పు పట్టి శిథిలావస్థకు చేరాయని వాటిని పునర్నిర్మించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే గుర్రపు డెక్క తొలగించి, కోతకు గురైన చోట కాల్వకట్టలు బలోపేతం చేయాలన్నారు. పెదకాకాని నుంచి గోళ్ళమూడి వెళ్లే రోడ్డు కాలువ లాకులు తుప్పు పట్టి నిర్వహణ సరిలేకపోవడం వలన శిథిలావస్థకు చేరాయన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయినందున ప్రభుత్వం వెంటనే స్పందించి గుంటూరు ఛానల్‌కు మరమ్మతులు చేయాలన్నారు. కోటిపల్లి సత్యనారాయణ, రాజా రమేష్, రైతులు దారం భవాని శంకర్, ఆలపాటి రాము, పి.సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

జూలై 9 దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ గౌరవ అధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి పిలుపునిచ్చారు. కొత్తపేట సీపీఐ జిల్లా కార్యాలయం మల్లయ్య లింగంభవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కార్మికుల పని గంటల పెంపుదలను 8 గంటల నుంచి 10 గంటలకు పెంచడంపై ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ సమ్మె జయప్రదానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, నాయకులు చల్ల చిన ఆంజనేయులు, పుప్పాల సత్యనారాయణ, కోట మాల్యాద్రి, చిన్ని సత్యనారాయణ, రావుల అంజిబాబు, సురేష్, మంగ శ్రీనివాసు, ఆరేటి రామారావు, రాజు, మీరావలి పాల్గొన్నారు.

రేపు హుండీ కానుకల లెక్కింపు

పట్నంబజారు: నగరంలోని లాలాపేట వేంకటేశ్వర స్వామి గ్రూపు ఆలయాల హుండీ కానుకల లెక్కింపు సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి, అసిస్టెంట్ కమిషనర్ సుభద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు.

200 గ్రాముల గంజాయి స్వాధీనం



నెహ్రూనగర్: గంజాయి కలిగి ఉన్న వ్యక్తిని ఎక్సైజ్ సూపరింటెండెంట్ స్క్వాడ్ సీఐ బి.నయనతార శనివారం అరెస్టు చేశారు. వివరాలు.. స్తంభాల గరువుకు చెందిన అక్కిగోపి, 200 గ్రాముల గంజాయి కలిగి ఉన్నడనే సమాచారంతో అతడిని అరెస్టు చేసి గంజాయి స్వాధీనం చేసుకుని గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు.

కుయ్యోస్కులు!

- ఆర్ఎస్‌కేలలోని కియోస్క్‌ల నిర్వహణను గాలికొదిలిన కూటమి ప్రభుత్వం
- రూ.కోట్లు ప్రజాధనం వృథా
- దుమ్ము కొట్టుకుపోతున్న మిషన్లు
- సేవలు అందక ఇబ్బందులు పడుతున్న రైతులు



ప్రత్తిపాడులోని రైతు సేవా కేంద్రంలో నిరుపయోగంగా పడి ఉన్న కియోస్క్ మిషన్లు

మండలం	ఆర్ఎస్‌కేలు	కియోస్క్‌లు పని చేస్తున్నవి
ప్రత్తిపాడు	13	5
పెదనందిపాడు	13	10
కాకుమాను	13	8
వట్టిచెరుకూరు	13	4
గుంటూరురూరల్	11	4
మొత్తం	63	31

ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వ నిర్వాకంతో రూ.కోట్ల ప్రజా ధనం వృథా అవుతుంది. రైతులకు వారి గ్రామంలోనే మెరుగైన సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ప్రస్తుతం రైతు సేవా కేంద్రాలు) ఏర్పాటు చేసింది. ఆయా కేంద్రాలకు కర్షకులు స్వయంగా వెళ్లి నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు రాయితీపై కొనుగోలు చేసుకునేందుకు వీలుగా కియోస్క్ యంత్రాలు ఏర్పాటు చేశారు. కూటమి ప్రభుత్వం గద్దెనెక్కిన తరువాత ఈ కియోస్క్ మిషన్లు మూలకు చేరాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అధికారులు వీటి నిర్వహణను పట్టించుకోని పరిస్థితి.

కియోస్క్‌లతో ఎంతో మేలు

వాస్తవానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ కియోస్క్ యంత్రాలను ఎంతో సదుద్దేశంతో ఏర్పాటు చేసింది. ప్రైవేట్ వ్యక్తులు, దళారులను నమ్మి నకిలీ పురుగు మందులు, విత్తనాల బారిన పడి రైతులు వారి చేతుల్లో మోసపోతున్నారు. ఈ నేపథ్యంలో రైతులు నకిలీ బారిన పడకుండా ఉండేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకే) ఏర్పాటు చేసి అందులో కియోస్క్ మిషన్లు అందుబాటులోకి తీసుకువచ్చింది. వీటి ద్వారా రైతులే స్వయంగా ఆర్బీకేలకు వెళ్లి అధికారులు, వ్యవసాయ సిబ్బందితో సంబంధం లేకుండా వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, పురుగు మందులు, నాణ్యమైన విత్తనాలను అవసరమైన పరిమాణంలో కియోస్క్ యంత్రాల ద్వారా బుక్ చేసుకోవచ్చు. నేరుగా రైతుల ఇంటికే వాటిని సరఫరా చేస్తారు. మార్కెట్లో పంటల ధరలు, వాతావరణ మార్పులు తదితర విషయాలను కూడా రైతులు కియోస్క్ ల ద్వారా తెలుసుకోవచ్చు. కానీ ఇంతటి కీలకమైన మిషన్లను వినియోగించకుండా కూటమి ప్రభుత్వం నిరుపయోగంగా వదిలేయడంతో అవి దుమ్ముకొట్టుకుపోతున్నాయి.

ఆర్ఎస్‌కేలలో సేవలు మృగ్యం

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 63 రైతు సేవ కేంద్రాలున్నాయి. వాటిలో కేవలం 31 కియోస్క్ మిషన్లు మాత్రమే పనిచేస్తుండగా, మిగిలినవి నిరుపయోగంగా మూలన పడి ఉన్నాయి. అయితే కూటమి సర్కారు రైతు సేవ కేంద్రాలకు ఎలాంటి యూరియా నిల్వలు, ఉత్పత్తులు ఆశించిన స్థాయిలో సరఫరా చేయకపోవడం, యంత్రాలకు ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించకపోవడంతో అవి కాస్తా నిరుపయోగంగా మారాయి. ఏడాది కాలంగా ప్రభుత్వం వీటి ఆలనా పాలనా పట్టించుకోకపోవడంతో, ప్రస్తుతం కేంద్రాల్లోని కియోస్క్‌లు ఉపయోగం లేకుండా పడిఉన్నాయి. సగానికి పైగా కేంద్రాల్లో యంత్రాలు ప్రస్తుతం పని చేయటం లేదు.



నడింపాలెంలో వినియోగంలో లేక దుమ్ముకొట్టుకుపోతున్న కియోస్క్‌లు

ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నిషేధించండి

డీఎల్‌పీఓ కె. శ్రీనివాసరావు



తుమ్మలపాలెం ఎల్‌టీసీలో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు

ప్రత్తిపాడు: సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని గ్రామాల్లో నిషేధించాలని డీఎల్‌పీఓ కె.శ్రీనివాసరావు తెలిపారు. ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెంలోని సుప్రీమ్ ఎల్‌టీసీలో శనివారం ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణ, చెత్త సేకరణ, కంపోస్టు ఎరువు తయారీ..వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎల్‌పీఓ మాట్లాడుతూ ప్రజలు తడిచెత్తను, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి, క్లాప్‌మిత్రాలకు అందించేలా వారికి విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ కె. శివపార్వతి, డిప్యూటీ ఎంపీడీఓలు షేక్ ఆదం షఫీ, రవికుమార్, స్వచ్ఛ భారత్ మిషన్ మండల రిసోర్స్ కో-ఆర్డినేటర్ డి.శ్రీనివాసరావు, సుప్రీమ్ ఎల్‌టీసీ పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా, ఐటీసీ మరియు ఫినిష్ సొసైటీ కో-ఆర్డినేటర్ ఉమామహేశ్వరి, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ పరిశీలన..

ప్రత్తిపాడు: పారిశుద్ధ్య కార్మికులు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయాలని ఎంపీడీఓ కె. శివపార్వతి అన్నారు. మండల పరిధిలోని యనమదలలో చెత్త సేకరణ జరుగుతున్న తీరును శనివారం ఉదయం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతర్గత వీధుల్లో పర్యటించారు. స్థానిక మహిళలతో మాట్లాడారు. పారిశుద్ధ్య కార్మికులు ఇంటింటికీ వచ్చి చెత్తను సేకరిస్తున్నారా? తడి చెత్త పొడి చెత్తను విడి విడిగా అందిస్తున్నారా? వంటి వివరాలను గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీలో సిబ్బంది చెత్తను వేరు చేయు విధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త ద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చుకునేలా కార్యదర్శి, ప్రజాప్రతినిధులతో కలిసి చొరవ చూపాలని చెప్పారు. వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

వైద్య కళాశాలలో పేరెంట్స్ వెయిటింగ్ హాల్ ప్రారంభం



పేరెంట్స్ వెయిటింగ్ హాలును ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి పూర్వ వైద్య విద్యార్థులు చేస్తున్న సాయం ఎంతో అభినందనీయమని వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి అన్నారు. వైద్య కళాశాల 1992 బ్యాచ్ విద్యార్థినులు వైద్య కళాశాల మహిళ వసతి గృహంలో పేరెంట్స్ వెయిటింగ్ హాలు ఆధునికీకరణకు రూ.9 లక్షల విరాళం అందజేశారు. ఆధునికీకరించిన హాలును శనివారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రూ.4 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశామన్నారు. వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు నగరానికి చెందిన పలువురు దాతల సహాయంతో ఏడు నెలల్లో వైద్య కళాశాలల్లో కార్పొరేట్ కళాశాలల కంటే ధీటుగా వసతులు సమకూర్చి వైద్య విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్యను అందిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్, విరాళం అందజేసిన డాక్టర్ బి.వి.శివమ్మ, డెప్యూటీ వార్డెన్ డాక్టర్ వై.సౌజన్య, విరాళం అందజేసిన డాక్టర్ వి.సునీత, డాక్టర్ ఎ.లక్ష్మీమమత, డాక్టర్ రాధాలక్ష్మి, డాక్టర్ కె.రాధిక, డాక్టర్ వెంకటరమణకుమారి, డాక్టర్ బి.మమత, డాక్టర్ సి.హెచ్.శాలిని, డాక్టర్ విజయశ్రీ పాల్గొన్నారు.

ఐసీఏఐ ఆధ్వర్యంలో చార్టర్డ్ అకౌంటెంట్స్ దినోత్సవం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) గుంటూరు చాప్టర్ కార్యాలయంలో శనివారం 77వ చార్టర్డ్ అకౌంటెంట్స్ డే నిర్వహించారు. ఈసందర్భంగా సీఏలతోపాటు సీఏ కోర్సులు చదువుతున్న విద్యార్థులతో రమేష్ హాస్పిటల్స్ నుంచి ఐసీఏఐ గుంటూరు చాప్టర్ కార్యాలయం వరకు వాకథాన్ నిర్వహించారు. గుంటూరు చాప్టర్ చైర్మన్ చింతా వీఎస్ఎస్ రఘునందన్, కార్యదర్శి వనిమిరెడ్డి వెంకట నరేష్, కోశాధికారి కన్నెగంటి మృత్యుంజయరావు, సభ్యులు షేక్ బాజీ, దేసు సంపత్, పలువురు సీఏలతో కలసి స్వచ్ఛభారత్ అభియాన్ పచ్చదనం-పరిశుభ్రత నినాదంతో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఏలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఐసీఏఐ భవన్ పరిసరాల్లో స్వచ్ఛభారత్ నిర్వహించారు.

అంధకారంలో గుంటూరు నగరం

- కార్మికుల వినూత్న నిరసన
- వీధి లైట్లు వెలిగించని సిబ్బంది



వీధి లైట్లు వెలిగించకపోవడంతో అంధకారంగా మారిన ఓ వీధి

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల జీతాలు పెంచడంతో, ఇతర పలు సమస్యలను పరిష్కారించాలని ఈ నెల 23వ తేదీ నుంచి కార్మికులు విధులు బహిష్కరించి నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. 27వ తేదీన మంగళగిరిలోని సీడీఎంఏ(కమిషనర్ అండ్ డైరెక్టరేట్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన నేపథ్యంలో 28వ తేదీ సాయంత్రం లోపు ఉన్నతాధికారుల నుంచి సమస్యల పరిష్కారానికి ఎటువంటి పిలుపు రాకపోతే 28వ తేదీ సాయంత్రం నుంచి నగరంలో వీధి లైట్లు వేయకుండా చేస్తామని హెచ్చరించారు. నిరసనలో భాగంగానే శనివారం రాత్రి నగరంలో అవుట్ సోర్సింగ్ కార్మికులు వీధి లైట్లు వేయకుండా తమ నిరసన వ్యక్తం చేశారు. ఇంకా తమ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని రాష్ట్ర మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మిక సంఘాల ఐక్య కార్యచరణ కమిటీ చైర్మన్ ఈదులమూడి మధుబాబు పేర్కొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

పొన్నూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు పట్టణంలోని సివిల్ జడ్జి కోర్టులో జూలై 5వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి. రుక్మిణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో కోర్టు పరిధిలోని క్రిమినల్ కేసులు, సివిల్, చెక్‌బౌన్స్, కుటుంబ తగాదాలు, బ్యాంకు కేసులను కక్షిదారులు రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని న్యాయమూర్తి తెలిపారు.

నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్

పట్నంబజారు: రౌడీషీటర్లు ఇష్టానుసారంగా వ్యవహరించి నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ హెచ్చరించారు. లాలాపేట పోలీసు స్టేషన్‌లో శనివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ నేర ప్రవృత్తిని మానుకొని సమాజ హితం కోసం రౌడీషీటర్లు కృషి చేయాలన్నారు. సివిల్ పంచాయితీలు, ఇతరత్ర నేరాల్లో పాల్గొంటే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీ మూకలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించబోమన్నారు. కౌన్సెలింగ్‌లో లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్ఐలు షేక్ హసీం, ప్రవీణ, విజయకుమార్, బాలానాయక్ పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి

లక్ష్మీపురం: సహజీవనం చేస్తున్న మహిళపై అనుమానంతో దాడి చేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహ సముదాయంలో నివాసం ఉంటున్న రెబ్కా అనే మహిళ మోషెలు సహజీవనం చేస్తున్నారు. వీరికి గతంలో వేరేవారితో వివాహాలు జరిగాయి. మోషెకు భార్య, ఇరువురు సంతానం ఉన్నారు. రెబ్కాకు ఇరువురు సంతానం ఉన్నారు. రెబ్కా భర్తను వదిలేసి మోషెతో సహజీవనం చేస్తోంది. వీరివురు చీరాల మండలం నందికొండపాలేనికి చెందిన వారు. వీరివురు మధ్య స్నేహంతో గుంటూరులోని అడవితక్కెళ్లపాడులో నివాసం ఉంటున్నారు. రూ.4 లక్షలు అప్పులు చేశారు. ఈ అప్పులు తీర్చలేక ఇద్దరి మధ్య వాగ్వాదం జరుగుతోంది. రెబ్కాకు మరో వ్యక్తితో అక్రమ సంబంధం ఉందంటూ అనుమానిస్తూ గొడవ పడుతున్నాడు. దీంతో భయపడిన రెబ్కా వేరే ప్రాంతంలో నివాసం ఉంటుంది. శనివారం మోషె జేకేసీ కళాశాల వద్దకు రావాలని రెబ్కాకు చెప్పాడు. దీంతో అక్కడకు రెబ్కా రాగా కత్తితో దాడికి పాల్పడ్డాడు. రెబ్కాకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులిని జీజీహెచ్‌కు తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చరిత్ర సృష్టించిన శుభాంశు

లక్ష్మీపురం: భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా అంతరిక్షంలో అడుగు పెట్టడం దేశానికి గర్వకారణమని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. సమావేశంలో విశ్లేషకులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు మాట్లాడారు.

గుర్తింపు లేని కళాశాల ఎదుట ధర్నా



లక్ష్మీపురం: గుర్తింపు లేని ఆక్స్‌ఫర్డ్ జూనియన్ కళాశాలలను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గండు శివ, బందారపు యశ్వంత్ డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో గుంటూరు నగరంలోని చంద్రమౌళి నగర్‌లోనిల జూనియర్ కళాశాల వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటర్ బోర్డు రూల్స్‌కి వ్యతిరేకంగా ఎటువంటి ఇంటర్ బోర్డు అనుమతులు లేకుండా కళాశాల నడుపుతున్నారని ఆరోపించారు. అలానే గుర్తింపు లేని ప్రైవేట్ కళాశాల వారు ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా అక్రమంగా పాఠ్య పుస్తకాలను 8 పుస్తకాలు రూ.12,000, రూ.15,000 లకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నారని చెప్పారు. తక్షణమే ఆర్ఐఓ గర్నెపూడి సునీత, స్పందించి అక్రమంగా పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న ఆక్స్‌ఫర్డ్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుంటాం అని విద్యార్థి సంఘాలకు హామీ ఇచ్చారు.

వైఎస్సార్ సీపీ మండల కమిటీల నియామకం



పొన్నూరు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాల పార్టీ కమిటీలను నియమించారు. ఈ మేరకు శనివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలయింది.

పొన్నూరు మండలం..

వైఎస్సార్ సీపీ పొన్నూరు మండలం అధ్యక్షుడిగా చింతలపూడి మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా సొపాటి శ్రీధర్, వేంపాటి అర్జున్ మహేంద్రరావు, ప్రధాన కార్యదర్శులుగా తుపాకుల గోవర్ధన్, షేక్ షరీఫ్, పాలేటి రవీంద్ర, పేర్లి రాజేష్, కార్యదర్శులుగా మునిపల్లె చైతన్య, నలి శ్రీనివాసరావు, లంకపోతు శివరామరెడ్డి, ముద్రబోయిన రమాదేవి, చింతగుంట రమేష్‌బాబు, కార్యవర్గ సభ్యులుగా మారుపూడి రమణ, కర్రు నాగమల్లేశ్వరరావు, బొంతగర్ల సాంబయ్య, పఠాన్ జాన్‌సైదా, చుండూరు సాయికుమార్, ఖగ్గా వేమారావు, బుద్ధ వీరయ్య, దేవరపల్లి విజయ్‌కుమార్, కొండమూడి నవకుమార్, సుఖవాసి సురేష్, కంచర్ల కిరణ్, కొత్తపల్లి శ్రీనివాస్, పుసులూరి శ్రీనివాస్, మద్ది ఉమామహేశ్వరరావు, కర్లపూడి ఎలీషా, ఈమని సంతోషరావు, మిరియాల సాంబశివరావు, ముకిరి ఈస, అడపా రామకోటేశ్వరరావు, ముద్రబోయిన దుర్గా నాగరాజు, ఇమ్మిడిశెట్టి రాజ్యలక్ష్మీ, కొండా శంకర్, ఉయ్యూరు సురేంద్రరెడ్డి, చేబ్రోలు నాగరాజు, దండమూడి జేమ్స్, ముద్రబోయిన శ్రీనివాసరావు, సాకెళ్ల శివ వెంకట ప్రసాద్, షేక్ అమీర్ జాని నియమితులయ్యారు.

చేబ్రోలు మండలం..

చేబ్రోలు మండలం అధ్యక్షుడిగా ఆళ్ల శ్రీరామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కోడూరు కోటేశ్వరరావు, యద్రుకుల వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శులుగా యామినేని శివయ్య, దుబ్బా రాజకుమార్, పులగం జ్యోతి, దాసరి ధనమ్మ, తోట వీరభద్రయ్య, కార్యదర్శులుగా నీలం మనోజ్, పఠాన్ అయూబ్ ఖాన్, సయ్యద్ ఖాశీం, కట్టా శ్రీనివాసరావు, ఉయ్యూరు పాములు, కార్యవర్గ సభ్యులుగా దువ్వాడ పెద చౌడయ్య, గడియం శ్రీనివాసరెడ్డి, తాటి హరికృష్ణ, గోపి వెంకటేశ్వరరావు, పసుపులేటి బాజి, మక్కె వెంకటేశ్వర్లు, సానక వెంకట సుబ్బయ్య, చున్నుపల్లి శ్రావణ్‌కుమార్, చొప్పర విద్యాసాగర్, మట్టుపల్లి సత్యనారాయణ, షేక్ గౌస్ సంధాని, ఆరాధ్యుల నాగేశ్వరరావు, యద్రాకుల బ్రహ్మయ్య, తోట శ్రీకాంత్, చింతాబత్తుని తులసీరావు, చింతాబత్తుని సునీల్ నియమితులయ్యారు.

పెదకాకాని మండలం..

పెదకాకాని మండలం అధ్యక్షుడిగా ముడియాల మల్లికార్జునరెడ్డి, ఉపాధ్యక్షులుగా దంతాల శ్రీనివాసరావు, కలింత రమేష్, ప్రధాన కార్యదర్శులుగా మర్రెడ్డి సుబ్బారెడ్డి, మురికిపూడి చంద్రశేఖర్, బద్దిపూడి రమేష్, లంకపల్లి శ్రీనివాస్, కార్యదర్శులుగా కొత్తపల్లి దుర్గా భవాని, సయ్యద్ అలీ, బత్తుల నాగకృష్ణ ప్రసాద్, పాగోలు శ్రీనివాసరావు, తాటినేని నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులుగా మున్నంగి రాంబాబు, పూల దేవయ్య, పగడాల మాణిక్యరావు, భీమవరపు వెంకటరెడ్డి, ఆళ్ల వెంకటేశ్వరరావు, బండి మరియమ్మ, మిండల నాగభూషణం, దానబోయిన శ్రీనివాసులు, దాసరి సురేష్, కట్టా వెంకటేశ్వరరావు, షేక్. ఇబ్రహీం, గొట్టిముక్కల లూథర్‌పాల్, కొమ్మినేని అంకమరావులు నియమితులయ్యారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయికుమార్



మహిళలతో మాట్లాడుతున్న డీపీఓ బి.వి.నాగసాయికుమార్

ప్రత్తిపాడు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బి.వి.నాగసాయికుమార్ అన్నారు. గుంటూరు రూరల్ మండలం గొర్లవారిపాలెంలో శనివారం ఉదయం డీపీఓ నాగసాయికుమార్, స్థానిక ఎంపీడీఓ బండి శ్రీనివాసరావుతో కలిసి పర్యటించారు. గ్రామస్తులు, మహిళలతో మాట్లాడారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి అందిస్తున్నారా? లేక మొత్తం కలిపి అందిస్తున్నారా? వంటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. దుకాణ నిర్వాహకులతో మాట్లాడారు. పారిశుద్ధ్య నిర్వహణలో పంచాయతీ సిబ్బందికి సహకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని అంతర్గత వీధులు, రక్షిత మంచినీటి ట్యాంకుల వద్ద పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. క్లోరినేషన్ చేసిన నీటిని గ్రామంలోనికి సరఫరా చేయాలని సెక్రటరీకి ఆదేశాలు జారీ చేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌ను పరిశీలించి సంపద సృష్టికి తీసుకోవలసిన చర్యలపై కార్యదర్శికి పలు ఆదేశాలు జారీచేశారు.

ఎల్‌టీసీలో శిక్షణ..

గుంటూరు రూరల్ మండలం వెంగళయపాలెం పంచాయతీలోని లోకల్ ట్రైనింగ్ సెంటర్‌లో శనివారం గుంటూరురూరల్, ఫిరంగిపురం, మేడికొండూరు మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శులకు ఎస్‌డబ్ల్యూపీసీల నిర్వహణ, సంపదసృష్టిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీపీఓ బీవీ నాగసాయి కుమార్ హాజరై ప్రతి గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ ద్వారా సంపదసృష్టి జరగాలని సెక్రటరీలను ఆదేశించారు. ఆయా మండలాల డిప్యూటీ ఎంపీడీఓలు కె.శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, పూర్ణ శంకరరావు, గ్రామ సర్పంచ్ నల్లపాటి లలితాకుమారి, కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం



బీసీ ఉద్యోగులను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ వీరయ్య, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ త్రిమూర్తిరావు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ ఈనెల 30వ తేదీన పదవీ విరమణ చేయనున్న బీసీ ఉద్యోగులకు యూనివర్సిటీ బీసీ ఉద్యోగ సంఘ నాయకులు శనివారం పూలే అధ్యయన కేంద్రంలో పదవీ విరమణ సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఎం.త్రిమూర్తిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరయ్య మాట్లాడుతూ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో బీసీ ఉద్యోగులు పలు హోదాల్లో విధులు అందరి మన్ననలు పొందారన్నారు. వీరి సేవలను యూనివర్సిటీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. త్రిమూర్తిరావు అధ్యక్షోపన్యాసం చేస్తూ బీసీ ఉద్యోగులు విధులు నిర్వహణ, బీసీ ఉద్యోగ సంఘం బలోపేతానికి ప్రత్యేక కృషి చేశారన్నారు. బీసీ వర్గాల హక్కుల కోసం ముందుండి పోరాడారని తెలిపారు. కార్యక్రమంలో డీఈ ఎస్. వెంకటేశ్వరరావు, బీసీ ఉద్యోగ సంఘ నాయకులు సిహెచ్.సాంబశివరావు ఐ.సాయిరాం, పరీక్షల విభాగం నోడల్ ఆఫీసర్ ఆర్.ప్రకాశరావు, భాను ప్రకాష్, సూర్య కామేశ్వరి, ఏఆర్ కాశయ్య, ఎస్.శ్రీనివాసరావు, షకీలా బేగం, విష్ణు, బి.కోటి యాదవ్ పాల్గొన్నారు.

మానసిక వ్యాధులు పెరిగిపోతున్నాయి



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న డాక్టర్ సుందరాచారి, పక్కన డాక్టర్ ఉమాజ్యోతి, డాక్టర్ ఫణిభూషణ్

గుంటూరు మెడికల్: మానసిక వ్యాధులు నానాటికి పెరిగిపోతున్నాయని గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య కళాశాల జింకానా ఆడిటోరియంలో శనివారం జీజీహెచ్ మానసిక వ్యాధుల వైద్య విభాగం, మానసిక వ్యాధి నిపుణుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ డిసీజెస్(ఐసీడీ-11) వర్క్‌షాపు నిర్వహించారు. వర్క్‌షాపును ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వల్ల ప్రతి ఒక్కరూ ఏదో ఒక మానసిక వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ, మానసిక వ్యాధుల విభాగాధిపతి డాక్టర్ నీలి ఉమాజ్యోతి మాట్లాడారు.